సంస్కారుడైన భర్త

ఏనాడూ లేంది ఆ వేళ ఉదయాన్నే కృష్ణ ప్రసాద్ గత రోజు ఆంధ్రపత్రిక కొన్నాడు హోటల్‌నుంచి తిరిగొస్తూ ఏవో కొన్ని వార్తల్ని చదివాడు తర్వాత రకరకాల ప్రకటనలు అతని దృష్టిపథాన్నాకర్షించకుండా వుండలేకపోయాయి. అందులో ముఖ్యమైంది నర్సాపూర్ వితంతు శరణాలయంవారి ప్రకటన.

అతన్ని ఒకవిధమైన జాలి ఆవహించింది. ఈ మగ వాళ్ళ స్వభావాన్ని చూస్తే అతనికే అసహ్యం వేసింది. రోజూ వృత్తి చేసుకునే వేశ్యలదగ్గరికి పోవడానికి సిగ్గుచెందని ఈ మనుష్యులు వితంతువివాహాన్ని పాపంకింద నిషేధించారు. అలాంటి సంస్కారానికి దిగిన వ్యక్తుల్ని అసహ్యించుకున్నారు. ఎప్పటికీ వాళ్ళని అమర్యాదతో చూడ్డానికి ప్రయత్నిస్తారు.

ఇంకా ఏవో ఆలోచనలు అతని తలలో మెదిలాయి. వాటికో స్వరూపమిచ్చుకుందుకు ప్రయత్నించసాగాడు.

చప్పున ప్రభావతి గుర్తుకువచ్చింది. నాలుగేళ్ళతర్వాత మళ్ళీ ఈవేళ తన మనోదృష్టిని పూర్తిగా లోబర్చుకుంది. మొదటిసారి పరిచయం ఎప్పుడు ఏర్పడింది? తన హృదయంలో ఆమె ప్రతిబింబం ఎందుకిలా హత్తుకుపోయింది? అతనికే తెలియలేదు ఎంతగా ఆలోచించినా.

వాళ్లు ఆవూరు వచ్చిన రెండునెల్లకి తను జామచెట్టు యెక్కి కాయలుకోసుకుంటున్నాడు. ప్రభావతికి అప్పుడు పదకొండేళ్ళు వీళ్ళింటి భాగాన్నే అద్దెకి తీసుకుని వున్నారు.

ప్రభావతికి నోరూరసాగింది చాలాసేపు కళ్లు అప్పగించి చూసింది. కాని చివరికి అడుగలేదు. కృష్ణప్రసాద్ ఇదంతా గమనించకపోలేదు. కాని అతనూ ఇవ్వడానికి ధైర్యం చెయ్యలేదు.

మరోనాడు ప్రభావతి తండ్రి – ఒక తహశీల్దారు – కాంప్‌నించి వచ్చి యిచ్చిన మిఠాయిని అరుగుమీద కుర్చీలో కూర్చుని తినసాగింది. కృష్ణప్రసాద్ అవతల అరుగుమీద కూచుని చదువుకుంటున్నాడు. ఈ వేళ అతను మళ్ళీ క్లిష్టపరిస్థితిలో పడ్డాడు. ప్రభావతి

ఆలోచించి, ఒక ఉండ అతనికిచ్చింది, అతను వొద్దంటున్నా తీసుకోక తప్పలేదు.

ఇలాంటి సంఘటనలే ఏవో వాళ్ళస్నేహానికి, ప్రేమకీ కారణమయ్యాయి. అల్లా రెండేళ్ళు గడిచాయి.

ఒకరోజు సాయంత్రం చీకటి పడిందోలేదో ప్రభావతి త్వరగావచ్చి, అతన్ని డాబామీదికి తీసుకుపోయింది.

"ఏమిటి సంగతి?"

ప్రభావతి, తన పెళ్ళి విషయమై తల్లీ, తండ్రీ మాటలాడుకున్నారనీ తనకి అతన్నే తప్ప ఇతరుల్ని పెళ్ళాడే వుద్దేశం లేదనీ, రెండు రోజుల్లో పెళ్ళివారు చూపులకి వస్తారనీ, అతన్నేదో నిర్ణయించుకొని తక్షణం తేల్చమనీ అడిగింది.

అతనాలోచించి అన్నాడు:

"నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నానని, నీకు తెలుసును. ఇంక ఇంతగా ఎందుకు ప్రశ్నిస్తావో నాకు తెలియదు?"

ప్రభావతి చెమ్మగిల్లిన కళ్లని తుడుచుకుని చేతిలో చెయ్యి వేయించుకుంది.

ఆరోజే అతనికి మరవరానిది అదే తర్వాత అతని జీవితంలో కొంత మార్పు తెచ్చింది.

అల్లా ప్రతిజ్ఞతీసుకున్న రెండునెల్లకే ప్రభావతి తండ్రికి బదిలీఅయింది. తర్వాత ఏదో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచినా అంత ఎక్కువ అవకాశం లేకపోయింది వాళ్ళ స్నేహానికి తన వివాహం నిశ్చయమైతెను ఏ పరిస్థితుల్లో లొంగిపోయిందీ తెలియబరుస్తూ, హృదయభారాన్ని వ్యక్తీకరిస్తూ, ప్రభావతి రాసిన చివరి ఉత్తరం అతన్ని కదిపేసింది. వాళ్ళవూరు వెళ్ళి ప్రభావతిని రహస్యంగా కలుసుకున్నాడు. ప్రభావతి విడిగావున్న ఆ కొద్ది నెలల్లోనూ, ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకున్నట్టు కనిపించింది కృష్ణ ప్రసాద్ ఇతర మార్గాలు ఆలోచించి చెప్పాడు. కాని ఏవీ సాధ్యాలుగా కనిపించలేదు. చివరికి "సంసారనౌకని సంతోషంతో నడుపుకో" అని అశ్రుపూరిత నేత్రాలతోనే ఆశీర్వదించి, సెలవుతీసుకుని వెళ్ళిపోయాడు. కాని హృదయాంతరాళాల్లో ప్రభావతికూడా ఎంత బాధపడుతున్నదీ, అతనెరగంది కాదు. ఆడవాళ్ళలో కన్పించే గాంభీర్యం ఆమెలో గోచరించింది. అతని కప్పుడు.

***

ఇన్నాళ్ళకి మళ్ళీ తన ఆలోచనల్ని దోచుకుంది ప్రభావతి ఇప్పుడు సంతోషంగా వివాహజీవితం గడుపుతూ వుంటుంది. ఎవరన్నా పిల్లలు కలిగారేమో? భర్త పరీక్షపాసై ఇంజనీరుగా వుండిపోతాడు.

తర్వాత కృష్ణప్రసాద్‌కి కూడా వైరాగ్యం కలిగింది. తల్లితండ్రులు పెళ్ళివిషయమై రెండు మూడుసార్లు హెచ్చరించినా అతను పెడచెవినిపెట్టాడు.

కాని వివాహం సంఘంలో కొంతవరకూ తప్పనిసరిగా కనిపించింది. పైగా ఈ మధ్య వొత్తిడికూడా ఎక్కువైంది. జీవితంలో అశాంతి ఎక్కువ కాసాగింది. అంచేత అంగీకరిద్దామా? అనుకుంటున్నాడు. బి.ఏ. చదివినా ఉద్యోగం చెయ్యటంలేదు చేద్దామనే కోరికాలేదు.

తండ్రి చనిపోవడంతో ఇంటి భారం నెత్తిమీదపడింది, తల్లి పెళ్ళిచేసుకోమని పోరసాగింది. విధిగా నౌకరీ వెతుక్కోవలసివచ్చింది.

ఇంటిలో చెప్పకుండా కృష్ణప్రసాద్ నర్సాపురం వెళ్ళాడు. అక్కడ మేనేజరుతో తన ఆశయం చెప్పి పిల్లల్ని చూసి ఏదో వొక వివాహం చేసుకొందామని ఉద్దేశపడ్డాడు. అల్లా అయితే తల్లికోరికా తీరుతుంది. తన ఈ సంస్కారం వల్ల కొంత అశాంతి తగ్గుతుంది.

మేనేజరు చిన్న వుపన్యాసం ఇచ్చాడు. తను సంఘ ఆశయాన్ని గురించీ, నేటియువకుల సంకుచిత బుద్ధుల్ని గురించీ, ఇతనిలాంటి కొందరు సాహసవంతుల్ని గురించీని. కృష్ణప్రసాద్‌కి అది అతను సర్వసాధారణంగా ఇచ్చే వుపన్యాసంలా కనిపించింది.

తర్వాత లిస్టును గురించి చెప్పాడు. ఇంటిలో అట్టే సంఘర్షణ రాకుండా, తన కులంవాళ్ళనే ఎంచుకుందామనుకున్నాడు కృష్ణప్రసాద్ తన సంస్కారభావాలకు పరిమితుల నేర్పరుస్తున్నందుకు చింతిస్తూ మేనేజర్ కూడా వచ్చి అందరిని చూపించాడు. అతన్ని ఆశ్చర్యంతో ముంచెత్తేలా ఆ చివరి అమ్మాయి ఎవరు? అతన్ని చూడగానే ఎందుకలా నీరవుతుంది? చివరికి పారిపోయింది కూడా! మేనేజరు "సిగ్గుపడుతోంది. ఆ అమ్మాయి" అన్నాడు.

కాని ప్రభావతా? ఆమెకీ దురవస్థ ఎందుకు వచ్చింది? అట్టాంటి పేరు మేనేజరు చెప్పలేదే ? యెంత ఆలోచించినా అతనికి తెగలేదు.

అవతలకి వచ్చాక మేనేజర్ని అడిగాడు ఆమెని కల్సుకోనిమ్మని.

మేనేజరు సిగ్గుతో పారిపోయిందనుకున్న అమ్మాయి గదిలో వెక్కి వెక్కి ఏడుస్తోంది. యెవరడిగినా చెప్పదు.

ప్రభావతి మాత్రం అతన్ని కల్సుకుందుకు ఇష్టపడలేదు.

కృష్ణప్రసాద్ పూర్వచరిత్ర అంతాచెప్పి తనే ఆమె గదికి పోయాడు. కాని ప్రభావతి సరిగా మాట్లాడలేదు. భర్త చనిపోయాడనీ, తల్లీ, తండ్రీ పునర్వివాహానికి వొప్పుకోలేదనీ మేనమామే స్వంత బాధ్యతమీద ఇక్కడకు పంపాడనీ చెప్పింది.

మర్నాడు పెళ్ళిజరగడానికి అక్కడే ఏర్పాటు జరుగుతుందని చెప్పి కృష్ణప్రసాద్ తన గదికి పోయాడు అతన్ని ఆశ్చర్యం, విషాదం అన్నీ బాధపెట్టసాగాయి అంతులేని సముద్రం మధ్య ఈదుతూన్న వాడిలా వుంది అతని పని.

మర్నాడుదయం ప్రభావతి గదిలో ప్రభావతి లేదు పెట్టేలేదు. యెవర్నడిగినా యెవరికీ తెలియదన్నారు. ఊరంతా వెతికించి మేనేజరు 'తన విచారాన్ని' తెలియజేశాడు.

కృష్ణప్రసాద్ ఆమె మేనమామ ఎడ్రస్ తీసుకుని అక్కడికి వెళ్ళాడు. ప్రభావతి యిల్లా యెందుకు వెళ్ళి పోవాలో అతనికీ యెంత ఆలోచించినా అర్థంకాలేదు. తన్ని పెళ్ళిచేసుకుందుకు ఇష్టంలేదా? అది తనకు యెందుకు తెలియచెయ్యకూడదూ?

మేనమామ అతన్ని ఆదరించాడు. ప్రభావతి అక్కడే వుంది. ప్రభావతిని సముదాయించాడు.

వారంరోజుల్లో, ఆయన ఆధ్వర్యాన్నే వాళ్ళకి సంస్కారవివాహం జరిగింది.

కాని ఆ రాత్రి ప్రభావతి అతనిచేత చేతులో చెయ్యి వేయించుకున్న విషయం యెవ్వరికీ తెలియదు ఆమెకీ, అతనికీ తప్ప. ఆనాడే ఆమె వివాహిత!

సన్నజాతి మొక్క వాసనల్ని మోసుకొచ్చి, పెళ్ళి పరిమళాల్తో కలుపుతున్న గాలి 'నాకుకూడ తెలుసు' అనుకుంది.